## మినీ కథ

# అతనికంటె

సాయంత్రం అయిదు గంటలయింది. సత్యం కంపెని నుండి బయటపడి ఎదురుగా రోడ్డు పక్కనున్న బడ్డీకొట్లో చార్మినార్ ప్యాకెట్ కొనుక్కుని ఓ సిగరెట్ వెలిగించి సైకిలెక్కబోయాడు.

'ఒరేయ్ సత్యం!' అంటూ కేక వినిపించింది. వెనుదిరిగి చూశాడు.

సుందరం రిక్షాలో వస్తూ కనిపించాడు.

సత్యం సుందరాలది ఒకే వూరు. ఇద్దరూ వాళ్ళ వూరి స్కూల్లో కలిసి చదువుకున్నారు. తర్వాత గుంటూరులో ఒకేరూంలోవుండి ఇంటర్ చదివారు. ఇక చదివించే స్తోమత తనకు లేదన్నాడు సత్యం వాళ్ళ నాన్న. తనకు తెలిసిన వాళ్ళను పట్టుకుని గుంటూరులోనే ఓ పొగాకు కంపెనీలో గుమాస్తా ఉద్యోగం వేయించాడు సత్యానికి. సుందరానికి చదువంటే ఆసక్తి లేకపోవటంతో వూళ్ళోనే వున్న వాళ్ళ రైస్‌మిల్ చూసుకుంటూ వుంటున్నాడు. అప్పుడప్పుడూ ఓ.పి. చేయటానికి గుంటూరు వస్తుంటాడు.

"మన వూరి నుంచేనా రావటం?" రిక్షా దిగుతున్న సుందరాన్ని అడిగాడు సత్యం.

"అవున్రా. ఈమధ్య రూం మార్చావటగదా ఎక్కడుంటున్నావో తెలీక కంపెనీలో దొరుకుతావుగదా అని ఇటే వస్తున్నా"

"అనుకోకుండా అరండల్ పేటలో అరవై రూపాయలకు మంచి గది దొరికింది. వెంటనే చేరిపోయాను. వెళ్దాం పద గదికి"

"ముందు మనం బస్టాండు కెళ్ళాలి."

"బస్టాండుకా! ఎందుకు?"

"ఒక ఎడ్వెంచర్ చేశాన్లే. వస్తావుంటే రెడ్డిపాలెం దగ్గర ఓ సుందరి బస్సెక్కి నా ముందు సీట్లోనే కూర్చుంది. మన సంగతి తెలిసిందేగా! అమ్మాయి వాలకం కనిపెట్టాం. మాటల్లో దింపి లైన్లోకి తెచ్చాను. ప్రస్తుతానికి బస్టాండులో వుంచి వచ్చాను."

"అయితే ఓ లాడ్జింగ్ రూం చూద్దాం పద"

"లాడ్జింగ్‌కా! అక్కడికయితే నిన్నెతుకుంటూ ఇంతదూరం రావటం దేనికిరా. పోయినసారి లాడ్జింగ్‌కెళ్ళి రైడింగ్‌లో పట్టుబడి వదిలించుకునేందుకు నానా యాతనా పడ్డామా ఇక బుద్దొచ్చింది. అయినా లాడ్జింగ్‌లో ఏం మనశ్శాంతి వుంటుందిరా. ఎవడు ఎప్పుడు వస్తాడో అని మనసు పీకుతూవుంటే ఏం ఎంజాయ్ చేస్తాం!"

"ఏమంటావురా అయితే"

"ఈ రాత్రికి నీరూమే శరణ్యం."

"నా రూంకా అపని మాత్రం వద్దురా. ఏదో తక్కువ అద్దెలో మంచి గది దొరికిందని మర్యాగా బతుకుతున్నా. మాయిల్లు గలాయన చాలా పెద్ద మనిషి. ఈ విషయం తెలిసిందా పెట్టే బేడాతో సహా బయటకు గెంటేస్తాడు. అయినా ఎవరో కంపెనీ దానికోసం ఇంత రిస్కు తీసుకోవటం అనవసరంరా."

"అది కంపెనీ సరుకు కాదురా. ఎవతో ఫామిలీ టైపులాగుంది."

"నీ బొంద. అందరూ అలాగే కనిపిస్తారు. ఫామిలీ టైపైతే బస్టాండులో నీకోసం వెయిట్ చేస్తూ వుంటుందా?"

"సరే అది ఎవరైనా కానీరా. ఫిగర్ నాకు నచ్చింది. నీకిష్టం లేకపోతే మానేయ్ కాని నాకు మాత్రం నీరూం కావాలి."

"ఎలారా! అదే వీలుపడదంటున్నాను."

"దానికి నేనో ప్లాను చెపుతానులే. నీరూంకి సపరేట్ ఎంట్రన్స్ వుందా?"

"లేదు. అందరికీ ఒకే వాకిలి. ఇంటికి వరుసగా మూడు గదులుంటాయి. మొదటి రెండు గదుల్లో ఇంటి వాళ్ళుంటారు. నేనుండేది చివరి గది. నేను పక్కనేవున్న సందుగుండా నా రూంలోకి వెళ్ళాలి."

"అయితే ఇంటి వాళ్ళకు కనిపించకుండా నీ రూంకి వెళ్ళటం కుదరదంటావ్."

"అవును."

"ఒకపని చేద్దాం. నీరూం అడ్రసు చెప్పు. నేను బస్టాండుకెళ్ళి దాన్ని తీసుకుని ఎనిమిది గంటలకల్లా హోటల్లో భోజనంచేసి నీరూంకు వస్తాం. మమ్మల్ని ఎవరని మీయింటి వాళ్ళడిగితే చెల్లెలు బావగారని చెప్పేయి. ఏలూరు వెళుతూ నిన్ను చూడటానికి ఇక్కడ దిగారని, తెల్లవారు ఝామున బస్సుందని, అప్పుడు వెళ్తారని చెప్పు. ఎవరికీ అనుమానం రాకుండ మాతో ఓఅరగంట గడిపి, తరువాత ఈ రాత్రికి ఎక్కడన్నా గడిపెయి."

"ఈ రాత్రికి నేనెక్కడుండాలనేది సమస్య కాదురా. ఎవతో తిరుగుబోతుదాన్ని నాచెల్లెలని చెప్పుకోవటానికి మనసొప్పటం లేదు. అయినా నాకు చెల్లెళ్ళు లేరని మాఇంటి గలాయనతో ఓసారి అన్నట్లుగా గుర్తు."

"సొంత చెల్లెలు కాకపోతే కజిన్ అని చెప్పరా. మనం ఏదో అవసరానికి వరసలు కలుపుతున్నాం కాని అనుకున్నంత మాత్రాన అది నీకు చెల్లెలవుతుందా? నీవన్న వవుతావా!"

సత్యానికి ఎలా తప్పుకోవాలో తోచలేదు. సుందరం తనకి చిన్ననాటి నుంచి స్నేహితుడు గుంటూరొచ్చినప్పుడల్లా తనకోసం చాలా ఖర్చు పెడుతూ వుంటాడు. ఇక వప్పుకోక తప్పదనుకున్నాడు సత్యం.

"సరేరా. కానీ మీరు మాత్రం చాలా జాగ్రత్తగా వుండాలి. తెల్లవారకముందే వెళ్ళిపోవాలి. మాఇంటి గలాయన అవులిస్తే పేగులు లెక్కెస్తాడు. ఏమాత్రం సంగతి కనిపెట్టాడా నాపని గోవిందా."

"ఒరేయ్ సత్తిగా! నీకే ఆపదా రానివ్వను. అనవసరంగా ఏదో జరుగుతుందని ముందే వూహించుకుని గాభరా పడకు" అభయమిచ్చాడు సుందరం.

సత్యం ఓ స్లిప్‌మీద తన గది అడ్రస్ రాసిచ్చాడు సుందరానికి.

'ఎనిమిదింటికల్లా వస్తాంరా. రూంలోనేవుండు' అంటూ సుందరం బస్టాండు కెళ్ళాడు.

రూం ఇవ్వటానికి ఒప్పుకున్నందుకు సత్యానికి మొదట భయమనిపించినా తన రూం ఓనరు పరమశివంగారు పనిమీద విజయవాడ వెళ్ళారని తెలుసుకున్నాక మనసు కుదుటపడింది.

అనుకున్నట్లుగా ఎనిమిదింటికల్లా సుందరం ఆ పిల్లతో రిక్షా దిగాడు. సత్యం వారిని సాదరంగా ఆహ్వానించి తన రూంకు తీసుకెళ్ళాడు.

"ఎవరు బాబూ వచ్చింది?" పరమశివంగారి భార్య సత్యాన్ని అడిగింది.

"మా బావగారువాళ్ళండి. ఏలూరు వెళ్తూ నన్ను చూసిపోదామని ఇక్కడ దిగారు. ఉదయం ఆరుగంటల బస్సుకు వెళ్తారు."

"మరి సామానుగట్రా ఏమీ లేకపోతేనూ...."

"అదా బస్టాండ్‌లోనే క్లోక్‌రూంలో ఉంచారు. పొద్దున్నే వెళ్తారుగదా! ఇంతదూరం మోసుకు రావటమెందుకని" తడుముకోకుండా చెప్పాడు సత్యం.

ఆమె మరో ప్రశ్న వేయలేదు.

పొద్దున్నే అయిదుగంటలకు వెళ్ళేటప్పుడు తాళం వత్తేసి వెళ్ళమని చెప్పి కొత్తపేటలో ఉన్న ఓ స్నేహితుడింటికి వెళ్ళాడు సత్యం పడుకునేందుకు.

మరునాటి ఉదయం రూంకు రాకుండా కంపెనీకెళ్ళి సాయంత్రం వచ్చాడు సత్యం.

"ఏమోయ్ సత్యం! కంపెనీనుంచేనా!" ముందుగదిలో ఉన్న పరమశివం అడిగాడు.

"అవునండి" అన్నాడు సత్యం తన రూం వైపు వెళ్ళబోతూ.

"ఒకసారి వచ్చిపోతావని."

"స్నానంచేసి వస్తానండి"

బాత్‌రూంలో స్నానంచేస్తూ ఆలోచించాడు సత్యం. పరమశివం తనను ఎందుకు పిలిచినట్టు! కొంపతీసి రాత్రి జరిగిన తతంగం తెలిసి వుంటుందా. తెలిసే అవకాశం లేదు. రాత్రి ఆయన వూళ్ళోలేదు, ఉదయం వచ్చుంటాడు. ఆయన భార్యకు కూడ అనుమానం వచ్చినట్టులేదు. తను చెప్పింది నమ్మింది. మరి ఎందుకైవుంటుంది! అప్పుడు గుర్తొచ్చింది సత్యానికి ఆ రోజు శనివారమని. ప్రతి శనివారం ఇంటివాళ్ళు తనను

# ఘనుడు

## మినీ కథ



టిఫిన్‌కు పిలుస్తూవుంటారు. అందుకే అయివుంటుంది. తను అనవసరంగా కంగారుపడ్డాడు.

స్నానం ముగించి లుంగీ కట్టుకుని టవల్ భుజానవేసుకుని బుద్ధిమంతుడిలా కూర్చున్నాడు సత్యం పరమశివంగారి ఎదురుగా కుర్చీలో.

''నీతో ఓ విషయం చెప్పాలోయ్.'' అన్నాడు పరమశివం.

ఏమిటన్నట్టు చూశాడు సత్యం.

''ఇల్లు ఇరుకుగా ఉంటుందంటున్నారు మా వాళ్ళు. నీవుంటున్న గదికూడలేందే సరిపోయేటట్టులేదు. అందువలన నీవు మరోగది చూసుకోంది తప్పేటట్లుగా లేదు.''

పరమశివం చెప్తున్నది నమ్మబుద్ధికాలేదు సత్యానికి. ఎందుకంటే ఆ ఇంట్లోకి కొత్తగా వచ్చిన వాళ్ళెవరూలేరు. ఇన్నాళ్ళూ సరిపోయిన ఇల్లు ఇప్పుడు సరిపోవటల్లేదంటే తనను ఖాళీ చేయించటమే పరమశివం అభిమతమన్నది అర్థమయింది సత్యానికి. అందువలన ఈ విషయంలో ప్రాధేయపడటం అనవసరమనిపించింది. తన నిర్వాకం ఎలాగో తెలిసుండాలి పరమశివానికి. కాని ఎలా తెలిసిందో అర్థంకాలేదు సత్యానికి. ఏదో సాకుచెప్పి మర్యాదగానే ఖాళీ చేయమంటున్నాడు. ఈ విషయంలో మరేదైనా మాట్లాడితే అసలు విషయం ముఖాన అనేసే ప్రమాదముందనుకున్నాడు సత్యం. అందుకే మరేం మాట్లాడలేదు.

''అలాగే! త్వరలోనే మరోగది చూసుకుంటాను'' అని లేచాడు సత్యం.

మరో నాల్గురోజుల తర్వాత ఆ గది ఖాళీ చేసి ఖాజీపేటలో మరో గదిలో చేరాడు.

ఓ రోజు జ్యోతిమహల్లో సెకండ్‌షో చూసి బయటకొచ్చాడు సత్యం.

''అన్నయ్యగారూ! బాగున్నారా?'' తననే ఎవరో పలకరిస్తున్నట్టుంది పక్కకు చూశాడు సత్యం.

''గుర్తుపట్టలేదా?''

''గుర్తుంది ఎందుకులేదు'' సత్యం చుట్టూ చూశాడు తనను ఎవరైనా గమనిస్తున్నారేమోనని.

''అక్కడే వుంటున్నారా? గది ఖాళీచేశారా?''

''అక్కడ వుండట్లేదు. వేరేచోట వుంటున్నాను''

''నేనప్పుడే అనుకున్నాలే? మీరా గది ఖాళీ చెయ్యాల్సివుంటుందని.''

''ఎలా అనుకున్నావ్?''

''నన్నూ, మీ స్నేహితుణ్ని ఆ ఇంటాయన చూశాడు మేము తెల్లవారుఝామున బయటకు వస్తూంటే. అప్పుడే వూరినుంచి వస్తూ రిక్షా దిగాడు.''

''చూస్తే ఏంపోయింది. మీతో ఆయన ఏమైనా మాట్లాడాడా?''

''ఏం, మాట్లాడలా!''

''మీరెవరో చెప్పాను కదా వాళ్ళింట్లో. నమ్మకుండా ఎలా వుంటాడు?''

''నేనెవరో వాళ్ళింట్లోవాళ్ళకి తెలీదు కాబట్టి నమ్మారు. ఈన ఎందుకు నమ్ముతాడు?''

''అయితే నువ్వాయనకు తెలుసా?''

''ఎందుకు తెలీదు. మన పాత ఖాతాదారే. చాలాసార్లు నన్ను తీసుకెళ్ళాడు లాడ్జింగ్‌లకి చుక్కన్నకంపెనీనుంచి. వస్తామరి.''

''ఓరి పరమశివం! పెద్దమనిషిలా నన్నే గది ఖాళీ చేయించావుకదరా.''

ఇది సత్యం స్వగతం.

సత్యానికి ఇంకో సందేహ మొచ్చింది.

'ఇదిగో అమ్మాయి మాట' వెనక్కి పిల్చాడు.

''ఏంటి రమ్మంటారా?''

''అహ! అందుక్కాదు. మేము ఆదేది నాటకమని నీకూ తెలుసుకదా! మరి పరమశివంగాడింటికి ఎలా వస్తానన్నావ్?''

''మనిషి తెలుసుకాని ఆ ఇల్లెవరిదో నాకు మాత్రం తెలుసేంటి?''

సత్యం ఇక మాట్లాడకుండా వడివడిగా నడిచాడు తన రూంకు.

—రామరాజు లక్ష్మీనారాయణ
కేరాఫ్ వై.వి.ఎల్. నరసింహారావు,
2/12 బ్రాడీపేట, గుంటూరు-2